




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
మే 8, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## హస్కీ కుక్కల కేసులో వీడిన మిస్టరీ.. నలుగురి అరెస్ట్

- సంగారెడ్డిలో హస్కీ కుక్కలను వదిలేసిన ఘటనలో పురోగతి
- ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఖర్చు భరించలేకే వదిలేసినట్లు విచారణలో వెల్లడి
- కుక్కలను కల్వరి టెంపుల్‌లో పెంచినట్లు గుర్తింపు
- టెంపుల్ లైసెన్సులపై జీహెచ్ఎంసీకి జిల్లా ఎస్పీ లేఖ



## తెలంగాణ బీడీ కార్మికులకు గుడ్ న్యూస్.. పెరిగిన వేతనాలు

- వెయ్యి బీడీలకు రూ.6 చొప్పున పెంపునకు ఒప్పందం
- ప్రస్తుతం వెయ్యి బీడీలకు రూ.268.31 చెల్లింపు
- రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది కార్మికులకు లబ్ధి
- ప్యాకర్లు, ఇతర సిబ్బంది జీతాల్లోనూ పెరుగుదల
- 2028 ఏప్రిల్ వరకు అమల్లో ఉండనున్న కొత్త జీతాలు



## కేటీఆర్ పై క్రిమినల్ కేసు నమోదు

రైతు సంగ్రామ సదస్సు వేదికగా కేటీఆర్ వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

## గంగుల కమలాకర్ కార్యాలయం వద్ద దాడి..
# కౌశిక్‌రెడ్డి కారు ధ్వంసం!

- బండి సంజయ్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగిన కౌశిక్ రెడ్డి
- డ్రగ్స్ తీసుకోవడం వల్ల సంజయ్ కు బట్టతల వచ్చిందని తీవ్ర వ్యాఖ్యలు
- కౌశిక్ కారు అద్దాలను ధ్వంసం చేసిన బీజేపీ కార్యకర్తలు



కరీంనగర్ : కరీంనగర్ రాజకీయం ఒక్కసారిగా సెగలు పుట్టిస్తోంది. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీసు వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మీడియా సమావేశంలో బండి సంజయ్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగారు. బండి సంజయ్‌కు డ్రగ్స్

(మిగతా 2వ పేజీలో)

## రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు: హరీశ్‌రావు

- వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన
- నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శ
- తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపణ






## వడ్డీలేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు :: తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

- మహిళా స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాలు
- రూ.10 లక్షల రుణానికి వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందన్న సీతక్క
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.25,228 కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు వెల్లడి



## ఉపరితల ద్రోణి.. తెలుగు రాష్ట్రాలకు 3 రోజుల పాటు వర్ష సూచన

- కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ద్రోణి ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని వెల్లడించిన వాతావరణ శాఖ
- ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం

తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనాన్ని కలిగించే వార్త చెప్పింది. కర్ణాటక నుండి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పుల వల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి, వాతావరణం చల్లబడే అవకాశం ఉంది. తెలంగాణ విషయానికి వస్తే... జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాల వర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు తమ కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు.

## ఇతర వాహనాలకు ఇబ్బంది లేకుండా, సాధారణ ట్రాఫిక్‌లో రేవంత్ కాన్వాయ్ ప్రయాణం...

శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లో కాన్వాయ్

- ట్రాఫిక్ పూర్తిగా నిలిపివేయకుండా ఒకే లైన్‌లో వాహనాలను కదలడానికి అనుమతి
- తన కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బందిపెట్టవద్దని రేవంత్ రెడ్డి ఇటీవల ఆదేశాలు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించింది. ఆయన కాన్వాయ్ కోసం ఎక్కడా ట్రాఫిక్‌ను నిలిపివేయలేదు. తన కాన్వాయ్ కోసం సామాన్యులను ఇబ్బంది పెట్టవద్దని, వాహనాలను ఆపవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీకి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లో ప్రయాణించింది. విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే వెళ్లడం గమనార్హం. ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడానికి బదులు ఒక లైన్‌లో వాహనాలను అనుమతించాలని ముఖ్యమంత్రి సూచించిన నేపథ్యంలో, పోలీసు అధికారులు ఈరోజు దానిని పాటించారు. ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా పోలీసులు వాహనాలను ఒకే లైన్‌లో కదలడానికి అనుమతించారు.

# టీవీకేలో ఉత్కంఠ

## మెజార్టీ చూపితేనే ఆహ్వానం అంటూ రాజ్‌భవన్ స్పష్టం

- మద్దతు కోసం ప్రాంతీయ పార్టీలతో వేగంగా సంప్రదింపులు
- ఎమ్మెల్యేల సమూహ రాజీనామాల చర్చ తమిళ రాజకీయాల్లో కలకలం
- అన్నాడీఎంకేలో చీలిక ఊహాగానాలకు షణ్ముగం రాజీనామా బలం?
- డీఎంకే తటస్థ ధోరణి... బీజేపీపై కాంగ్రెస్ మండిపాటు
- ప్రభుత్వం ఏర్పాటుపై చెన్నైలో రోజురోజుకూ ముదురుతున్న ఉత్కంఠ




**తమిళనాడు రాజకీయాలు మరోసారి ఉత్కంఠభరిత మలుపు తిరిగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సంచలన ఫలితాలు సాధించి అధికారానికి అతి సమీపంలో నిలిచిన టీవీకే అధినేత విజయ్‌కు ప్రభుత్వ ఏర్పాటు దారి మాత్రం ఇంకా క్లిష్టంగానే కనిపిస్తోంది. తగిన సంఖ్యాబలం నిరూపిస్తేనే ఆహ్వానం ఇస్తామని గవర్నర్ సీవీ అర్లేకర్ స్పష్టంగా తెలియజేయడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. దీంతో టీవీకే శిబిరం ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకు దూకుడు పెంచింది.**

చెన్నై: గత 24 గంటల్లో రెండోసారి గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని విజయ్ విజ్ఞప్తి చేసినప్పటికీ స్పష్టమైన హామీ రాకపోవడం టీవీకే వర్గాల్లో ఆందోళన పెంచింది. అసెంబ్లీలో అవసరమైన మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు జాబితాతో రావాలని గవర్నర్ సూచించినట్లు తెలుస్తోంది. ముందుగా ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాన్ని ఇతర కూటములకు ఇవ్వవద్దని విజయ్ కోరినట్లు సమాచారం. టీవీకేకు మద్దతుగా పార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర ఆవేశంతో ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అవసరమైతే మూకుమ్మడి రాజీనామాలకు కూడా సిద్ధమనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇదే సమయంలో గవర్నర్ వైఖరిని న్యాయపరంగా సవాలు చేసే దిశగా కూడా పార్టీ చర్చలు ప్రారంభించినట్లు సమాచారం. సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలను న్యాయ నిపుణులతో సమీక్షిస్తున్నట్లు చెన్నై రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇక అన్నాడీఎంకే వైఖరి తమిళ రాజకీయాల్లో కొత్త చర్చకు

(మిగతా 2వ పేజీలో)



## బహిరంగ మద్యం సేవ, గంజాయి వినియోగంపై ఉస్మానియా యూనివర్సిటీ  పోలీసుల ప్రత్యేక డ్రైవ్

సికింద్రాబాద్,  వార్త మిర్రర్ మే 7:  నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం పిఎస్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు ఓయూ సిటీ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఓయూ డివిజన్  ఏసిపి జగన్,  ఓయూ ఇన్స్ పెక్టర్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ  చట్ట విరుద్ధంగా మద్యం సేవిస్తున్న ప్రాంతాలు, గంజాయి వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకునే దిశగా ఈ తనిఖీలు చేపట్టినట్లు  తెలిపారు.ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వైన్ షాపుల పర్మిట్ రూమ్‌ల వెలుపల, జీహెచ్ఎంసీ పార్కులు, శ్మశాన వాటికల పరిసరాలు, క్రైమ్ ప్రోన్ ఏరియాలు తదితర ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు వారు తెలిపారు.  ఈ సందర్భంగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, గంజాయి వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. నగరంలో శాంతిభద్రతలు పరిరక్షించడం, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం లక్ష్యంగా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజలు కూడా చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.






## విశాలభారతిలో ఘనంగా వరల్డ్ అథ్లెటిక్ డే సంబరాలు..

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 07



చౌటుప్పల్ మండల కేంద్రంలోని విశాల భారతి హై స్కూల్ నందు వరల్డ్ అథ్లెటిక్ డే సందర్భంగా పాఠశాలలో సమ్మర్ క్యాంప్ లో పాల్గొన్న విద్యార్థులకు వివిధ రకాల ఆటలను, డాన్స్, రన్నింగ్, ఋబిక్ క్యూబ్ ప్రథమ బహుమతి ప్రసన్నాంజనయులు, ద్వితీయ బహుమతి ధీక్షిత్ గెలుపొందినారు , ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి జెండా ఊపి ఆటలను ప్రారంభించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ... వివిధ ఆటలు మానవ శరీరానికి ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియజేశారు.ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా రవీంద్రనాథ్ ఠాగూర్ గురించి జాతీయ గీతం యొక్క గొప్పతనం గూర్చి తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి, పాఠశాల ఫౌండర్ కందుల మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్యం శ్రీనివాస్, ఆంటోని, పి ఇ టి  ప్రవీణ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు..

## ప్యాషన్ కోసం పెంచారు.. భారం కాగానే వదిలేశారు..! మూగజీవాల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

ఖరీదైన సైబీరియన్ హస్కీ కుక్కలు వీధుల్లో తిరుగుతున్న ఉదంతం కలకలం సృష్టిస్తోంది. విదేశీ జాతికి చెందిన ఈ ఖరీదైన కుక్కలను పెంచలేక నడిరోడ్డుపై వదిలేస్తున్నారు యజమానులు. సంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసిన ఈఘటనపై బీడీఎల్ భానూరు పోలీసులు వేగంగా స్పందించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.ప్యాషన్ కోసం పెంచారు.. భారం కాగానే వదిలేశారు..! మూగజీవాల పట్ల ఇంత నిర్లక్ష్యమా?ఖరీదైన సైబీరియన్ హస్కీ కుక్కలు వీధుల్లో తిరుగుతున్న ఉదంతం కలకలం సృష్టిస్తోంది. విదేశీ జాతికి చెందిన ఈ ఖరీదైన కుక్కలను పెంచలేక నడిరోడ్డుపై వదిలేస్తున్నారు యజమానులు. సంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసిన ఈఘటనపై బీడీఎల్ భానూరు పోలీసులు వేగంగా స్పందించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.నందిగామ గ్రామ శివారులో సైబీరియన్ హస్కీ కుక్కలను వదిలిపెట్టినట్లు సమాచారం అందడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సీసీటీవీ ఫుటేజ్, వాహనాల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, మియాపూర్ కల్వరి టెంపుల్ సమీపంలో నిందితుల వాహనాన్ని గుర్తించారు. ఈ కేసులో ఫతేనగర్‌కు చెందిన సత్యనారాయణ, హనుమాన్‌పేటకు చెందిన సుధీర్ బాబు, కొల్లూరు గ్రామానికి చెందిన సుందర్ సింగ్, రామ్ నరేష్ నగర్‌కు చెందిన ఎస్.ఏ. సత్యనారాయణలను అదుపులోకి తీసుకున్నారు. ఈ నలుగురు కలిసి సైబీరియన్ హస్కీ జాతికి చెందిన కుక్కలను సంగారెడ్డి జిల్లా నందిగామ గ్రామ శివారులో వదిలిపెట్టినట్లు విచారణలో తేలింది.ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన భానూరు పోలీసులకు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో నిందితులు పలు కీలక విషయాలను వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. తమ వద్ద ఉన్న స్థలం సరిపోకపోవడం, కుక్కల వయసు పెరగడంతో వాటిని సంరక్షించడం కష్టంగా మారిందని, అందుకే గ్రామ శివారులో వదిలిపెట్టినట్లు అంగీకరించినట్లు చెబుతున్నారు. అయితే జంతువులను ఇలా అనాథలుగా వదిలేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు స్పష్టం చేశారు. పెంపుడు జంతువులను బాధ్యతగా చూసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. యజమానులు వాటిని రోడ్లపై వదిలేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తడమే కాకుండా, జంతువుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కుక్కలను తరలించడానికి ఉపయోగించిన వాహనాన్ని పోలీసులు మియాపూర్‌లోని కల్వరి టెంపుల్ సమీపంలో గుర్తించారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. “మార్నింగ్ వాక్” తో ప్రతి కాలనీ సమస్యల పరిశీలన.

**మార్నింగ్ వాక్ తో ప్రజా ప్రతినిధులకు ప్రజలకు మధ్య సంబంధాలు బలోపేతం.!**

**సంక్షేమ పథకాలు- పెన్షన్లు- ఇండ్ల మంజూరు అర్హుల కై స్వయంగా ప్రజా ప్రతినిధుల పరిశీలన**



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

సంస్థాన్ నారాయణపురం గ్రామ సర్పంచ్ పాలకవర్గ సభ్యులు చేపడుతున్న “మార్నింగ్ వాక్” కు మంచి స్పందన ఉదయాన్నే గ్రామంలో కాలనీలు పర్యటిస్తూ ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ ప్రాంతంలోని మౌలిక సదుపాయాల సమస్యలను అడిగి తెలుసుకుంటూ.. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుంటూ “త్రాగునీరు” డ్రైనేజీ” రోడ్లు వంటి సమస్యలను తక్షణమే గుర్తిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటివి అర్హులకు అందించేందుకు స్వయంగా పరిశీలించడం వాటి పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కారాల కోసం, ప్రజాప్రతినిధులు చేపట్టిన “మార్నింగ్ వాక్” సంస్థాన్ పాలకవర్గానికి మంచి స్పందన లభిస్తుంది, మార్నింగ్ వాక్ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి పాలకవర్గ సభ్యులు సూరపల్లి వెంకటేష్, బల్గూరి శివ సాగర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మందుగుల బాలకృష్ణ,





మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, రాచకొండ రమేష్ బాబు, రాసమల్ల వెంకటయ్య, బద్దుల మురళి యాదవ్, మారగోని శంకర్ గౌడ్, కారోబార్ పున్నమి యాదగిరి, పెద్దగోనిగిరి తదితరులు పాల్గొన్నారు

# కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో స్లమ్ ఏరియా నిరుపేదలకు ప్రసాద వితరణ

**అనాధల ఆకలి తీర్చిన మీరు నూతన వ్యాపారంలో అభివృద్ధి చెందాలి- కపిల్ కుమార్ అగర్వాల్**

**ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న శంకర్ నాయక్ కు ఘన సన్మానం**




వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో స్లం ఏరియా లోని నిరుపేదలకు అల్పాహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మిత్రులు రెడ్డి కొత్త వ్యాపారం అభివృద్ధి పథంలో నడవాలని నిరుపేదల కడుపు నింపిన ఆ వ్యాపారి వ్యాపార రంగంలో శిఖరాలకు చేరాలని పేదలు ప్రార్థించారు. అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ కూడా రెడ్డి గారి వ్యాపారం ఇలాగే పురోగమించాలని, దేవుడు ఆయనకు పగలు రాత్రి పురోగతిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈరోజు జరిగిన సేవలో శంకర్ నాయక్ గారిని సన్మానించారు. ఆయనతో పాటు కోశాధికారి కుష్ అగర్వాల్, ఇతర సభ్యులు సంజయ్ ధనావత్, పాకా సతీష్ యాదవ్, సునీల్ దరాడే పాల్గొని జి. సాయిదీ రెడ్డి సాహెబ్ కొత్త వ్యాపారానికి శుభాకాంక్షలు తెలిపారు.



# రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయాలని భువనగిరిలో రైతుల మహా ధర్నా

**రైస్ మిల్లలతో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి కుమ్మక్కు - జనగాం పాండు ఆరోపణ**



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక రైతులనుపట్టించుకోని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగాభువనగిరి మండలం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు ఆధ్వర్యంలో బిఆర్ఎస్, బిజెపి రైతన్నలు తుక్కాపూర్ ఎక్స్ రోడ్, వద్ద నల్లగొండ రోడ్డు. పైన రైతులు మహాధర్నకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఈ ప్రాంతం ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి రైతులను



పట్టించుకోకుండా రైస్ మిల్లలతో ఎమ్మెల్యే  కుమ్మకై రైతులను మోసం చేస్తూ వడ్లు క్వింటలుకు 3ఎస్త్ర లు కటింగ్ చేస్తూ తప్పుడు హామీలు ఇచ్చికుటు ప్రజల మోసం చేస్తుండు అని ఆరోపించారు. తక్షణమే రైతుల వద్ద వడ్లు కొనుగోలు చేయాలని, రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నోముల మహేందర్ రెడ్డి, పుట్ట వీరేష్ యాదవ్ ,మాజీ ఎంపిటిసి రాసాల మల్లేష్ యాదవ్, నల్లమస  సత్యనారాయణ గౌడ్, గ్రామ ఉప సర్పంచ్ రాసాల లింగస్వామి యాదవ్, వార్డ్ మెంబర్స్, ఎల్లంకొండ  రాజశేఖర్ రెడ్డి, వల్లపు సతీష్ యాదవ్ రత్నాపురం శ్రీకాంత్, ముంత కృష్ణవేణి, దోమటి దేవేందర్, జనగాం యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షుడు. రాసాల శేఖర్ యాదవ్, నాయకులు ఎల్లంకొండ సుధాకర్ రెడ్డి, కశీరం రాజమోహన్, నాయకులు పడమటి జైపాల్ రెడ్డి, జక్కిడి రాజశేఖర్ రెడ్డి,ఎదునూరి వెంకయ్య, చంద్రపాల్ కాసాని వెంకటేష్, జిల్లా శ్రీశైలం యాదవ్, ముంత సతీష్ యాదవ్, మర్రి నర్సింహా రెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి  రమేష్, శివశంకర్, నోముల లలిత, మాకొాలు పద్మ, గజ్జి నాగమ్మ ,సుజాత గ్రామ రైతులు ప్రజలు పాల్గొన్నారు

# హైదరాబాద్‌కు 'నేషనల్ సైన్స్ సెంటర్'

### నిర్మాణ పనులు పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి





సికింద్రాబాద్, వార్త మిర్రర్, మే 7: తార్నాకలో నిర్మాణంలో ఉన్న 'హైదరాబాద్ నేషనల్ సైన్స్ సెంటర్' పనులను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి, వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరానికి ఈ సైన్స్ సెంటర్ మరో ప్రతిష్టాత్మక కేంద్ర ప్రభుత్వ సంస్థగా నిలవబోతుందని తెలిపారు. రక్షణ, సైన్స్, ఐటీ, విద్యా రంగాల్లో ఇప్పటికే ప్రముఖ పరిశోధనా సంస్థలు ఉన్న హైదరాబాద్‌లో ఇప్పుడు నేషనల్ సైన్స్ సెంటర్ ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. యువత, విద్యార్థులు, పరిశోధకులకు సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో ఈ సైన్స్ సెంటర్ హైదరాబాద్‌కు మంజూరైందని, వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అధికారుల సమాచారం ప్రకారం వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్‌కు రానున్నట్లు వెల్లడించిన కిషన్ రెడ్డి, రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ పార్క్, వరంగల్‌లో ప్రధానమంత్రి మెగా టెక్స్‌టైల్ కాకతీయ పార్క్ పనులకు భూమిపూజలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధి పనులను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ రైల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ములుగులో ఏర్పాటు కానున్న ట్రైబల్ యూనివర్సిటీ, ఎయిమ్స్ తరహా ఆసుపత్రుల భూమిపూజలు లేదా ప్రారంభోత్సవాలను కూడా రాబోయే మూడు నుంచి నాలుగు నెలల్లో ప్రధానమంత్రి చేతుల మీదుగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. .....కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని ఘనంగా సన్మానించిన మల్లెల నర్సింగరావు ఐఐసీటీలో నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని మేడ్చల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు మల్లెల నరసింగరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కాటిపల్లి రవీందర్ రెడ్డి, మల్క ప్రకాష్, కురపాక అంజి, భాస్కర్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై ఎండీకి వినతిపత్రం

### ....జూన్ 2న అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని బహుజన వర్కర్స్ యూనియన్ డిమాండ్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 7: టీజీఎస్ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ ఆధ్వర్యంలో ఆర్టీసీ వీసీ అండ్ ఎండీని కలిసి పలు కీలక డిమాండ్లపై వినతిపత్రం సమర్పించారు. ఈ బృందంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గౌడ రవి కిరణ్, ఉప ప్రధాన కార్యదర్శి డి. రామచంద్ర, రాష్ట్ర కార్యదర్శి ఎ. శ్రీనివాస్, సంతోష్ కుమార్ లకావత్, జె. సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఈ నెల 24వ తేదీన అధికారిక ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒకవేళ ఆ తేదీన సాధ్యం కాకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని వినతిపత్రంలో కోరారు. విలీన ప్రక్రియకు సంబంధించి కొన్ని విధివిధానాలను రూపొందించి, వాటిపై సమగ్ర నివేదికను వీసీ అండ్ ఎండీకి అందజేసినట్లు నాయకులు తెలిపారు. అలాగే ఇటీవల మరణించిన శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు ప్రతి ఉద్యోగి మే నెల జీతం నుంచి రూ.300 చొప్పున కట్ చేసి అందించాలని లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ సమర్పించిన నివేదికను పరిశీలించిన ఎండీ, ప్రభుత్వానికి తగిన సూచనలతో పంపిస్తామని, యాజమాన్య పరంగా ఉద్యోగుల విలీనానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. సురేఖ, తిరుపతయ్య, బి. శ్రీనివాస్ గౌడ్, టి. కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ సభకు లక్షలాదిగా తరలిరండి: మేకల సారంగపాణి



సికింద్రాబాద్, వార్త మిర్రర్, మే 7: ఈ నెల 10వ తేదీన సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు లక్షలాదిమంది హాజరై విజయవంతం చేయాలని బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పిలుపునిచ్చారు. గురువారం బీఎన్ఆర్ గార్డెన్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం కందటి నాగేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల సారంగపాణి మాట్లాడుతూ, ప్రధాని మోదీ సభను విజయవంతం చేసేందుకు శుక్రవారం ఉదయం 8 గంటలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శివాజీ విగ్రహం సమీపంలోని ఆర్కేఎం ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకుల సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లాకు సంబంధించి సుమారు 25 వేల మంది జనసమీకరణ లక్ష్యంగా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాయని పేర్కొన్నారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలను తరలించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు బండ కార్తీక్ రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వివిధ వర్గాల ప్రజలు, కుల సంఘాలు, మేధావులు, యువత, మహిళలను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వాన పత్రికలు, కరపత్రాలు అందజేస్తున్నామని చెప్పారు. అందరూ పెద్ద సంఖ్యలో సభకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి ప్రసాద్ గౌడ్, కనకట్ల హరి, ఆకారం రమేష్, అనూష, వెంకటేష్ గౌడ్, కొల్లి నాగేశ్వరరావు, అనిత, శారద మల్లేష్, అజయ్ నాయుడు, మాజీ డివిజన్ అధ్యక్షుడు అమల రాజేశ్వరరావు, శ్రీధర్, దత్త సాయి, డివిజన్ అధ్యక్షులు ఇవి నరేష్, ఉపేందర్ యాదవ్, సాయి ప్రసాద్, ఆదర్శ్ కుమార్, గాజుల సౌందర్య, సేతు మహేష్, సుబ్బారావు, హనుమంతు ముదిరాజ్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



# అల్లిపూర్ లో బడిబాట కార్యక్రమం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 7

ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన విద్య నేర్పుతున్నారని అందరూ వారి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని అల్లీపూర్ గ్రామ సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మార్చి 2026 లో జరిగిన పదవ తరగతి పరీక్షల యందు100% ఉత్తీర్ణత సాధించారని విద్యార్థిని విద్యార్థులను గ్రామ సర్పంచ్, ఎంబారీ గౌతమి, ఉప సర్పంచ్, వినయ్, ఏఏపిసి చైర్ పర్సన్, అంజలి, ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్ సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు గుర్రం శ్రీనివాస్, వసంతరావు, రవికుమార్, రాతిలాల్ రాజాశేఖర్, రాజన్న, జీవన్ రెడ్డి, శంకరయ్య, క్రిష్ణ ప్రసాద్, బడిబాటలో భాగంగా డీజే తో గ్రామంలోని వీధి వీధికి తిరుగుతూ పాఠశాలల్లో అడ్మిషన్ల కొరకై కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# బిజెపి పట్టణ అధ్యక్షునికి ఘన సన్మానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 7 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రాయికల్ పట్టణం లోని శివాజీ గోనెకాపు రెడ్డి యువజన సంఘ భవన నిర్మాణము కోసం ఎంపీ నిధుల నుండి 4 లక్షల రూపాయలు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించిన బిజెపి పట్టణ అధ్యక్షులు కుర్మ చిన్న మల్లారెడ్డిని, గోనేకాపు రెడ్డి సంఘ సభ్యులందరూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కుంబాల శ్రీనివాస్ రెడ్డి, పాతూరి రమాపతి రెడ్డి, జలపతి రెడ్డి, లింగారెడ్డి, కొయ్యడి మహిపాల్ రెడ్డి, ఎద్దండి రాజు రెడ్డి, కుర్మ రాము రెడ్డి, నారాయణ రెడ్డి, రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రాజ రెడ్డి, సుభాష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.




# ధావన్ పల్లి అంగన్వాడి కేంద్రములో పోషకాహార పంపిణీ..

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 7

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల సెక్టార్లోని ధావన్ పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో గ్రామ సర్పంచ్ మాలవత్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవుల సందర్భంగా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు, మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లల యొక్క బరువులు, ఎత్తులు తీసి తల్లులకు అవగాహన కలిగించి, వారికి ఈ నెలలో 25 రోజులకు గాను ఇంటికి సరుకులు అనగా బియ్యం పప్పు, నూనె, గుడ్లు, పాలు, బాలామృతం, బాలమృతం ప్లస్, మురుకులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ తల్లులకు ఎండల యొక్క తీవ్రత బాగా ఉన్నందున పిల్లలు, గర్భిణీ స్త్రీలు, తల్లులు, పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వీలైనంతవరకు పానీయాలు అనగా కొబ్బరి నీళ్లు, నీళ్లు ఎక్కువగా తీసుకోవాలని వారికి అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బాణావత్ రవీ, గ్రామ కార్యదర్శి మహేష్, అంగన్వాడి టీచర్ రోజా, ఆయమ్మ అమృత, తల్లులు గర్భిణీలు, బాలింతలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నా, సీఎం రేవంత్ రెడ్డి కి కనికరం లేదు

### రాష్ట్రవ్యాప్తంగా వడ్ల కొనుగోలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం...

### ఢిల్లీకి నజరానా, రైతులకేమో జరిమానా







వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 07


రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి టీ.హరీశ్‌రావు అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రివర్యులు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తో కలిసి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి టీ.తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వడ్ల కొనుగోలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నా, సీఎం రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో వడ్ల కొనుగోళ్లలో ఏనాడూ ఇంతటి దారుణ పరిస్థితులు లేవు. కాంగ్రెస్ పాలనలో రైతులకు యూరియా, రైతుబంధు, సాగునీరు, కరెంటు, చివరికి పండిన పంట అమ్ముకునే దాకా అడుగడుగునా ఇబ్బందులే ఎదురవుతున్నాయి. జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిన్న ప్రెస్ మీట్ పెట్టి మేం చాలా బాగా వడ్లు కొంటున్నాం, ఎవరికీ ఇబ్బంది లేదు అని గొప్పలు చెప్పారు. అయ్యా ఉత్తమ్.. నేను ఏసీ రూమ్ లో కూర్చుని మాట్లాడటం లేదు. యాదాద్రి భువనగిరి నీ జిల్లాలోని చౌటుప్పల్ మార్కెట్లో రైతుల మధ్య నిలబడి మాట్లాడుతున్నా. ఈ తల్లీ, ఈ చెల్లెలు వడ్లు మార్కెట్ కు తెచ్చి 24 రోజులైంది. 30వ తేదీన మాయిశ్చర్ చూసి పాస్ అన్నాక కూడా 8 రోజులుగా కాంటా పెట్టే దిక్కే లేదు. 44 డిగ్రీల ఎండలో రైతులు నెల రోజులుగా పడిగాపులు కాస్తూ, పిట్టల్లాగా రాలిపోతున్నారు. ఇది పూర్తిగా మీ ప్రభుత్వ చేతగానితనమే. మాయిశ్చర్ చూడటానికి పది రోజులు, సంచులివ్వడానికి వారం, కాంటాకు వారం, మిల్లుకు వెళ్లడానికి మరో వారం పడుతోంది. తీరా మిల్లుకు వెళ్లాక తాలు ఉందని చెప్పి లారీకి 4, 5 బస్తాలు కటింగ్ పెడుతున్నారు. అటు మార్కెట్లో తరుగు, ఇటు మిల్లులో కోత.. అసలు మీకు వడ్లు కొనడం చేతనవుతోందా? ఉత్తమ్ కుమార్ రెడ్డి గల్లీలకు వచ్చి రైతుల గోస వినండి. మీ రేవంత్ రెడ్డి పాలన ఎట్లా ఉందంటే.. ఢిల్లీకి నజరానా, రైతులకేమో జరిమానా అన్నట్టుగా తయారైంది. 69 సార్లు ఢిల్లీకి పోయి కప్పం కట్టే బదులు రైతులను పట్టించుకోండయ్యా. తరుగు పెడితే తోలు తీస్తా అన్న సీఎం. ఇప్పుడు ఎవరి తోలు తీస్తాడో చెప్పాలి. ప్రతి బస్తాకు 2-3 కిలోల తరుగు తీస్తుంటే ఏం చేస్తున్నారు. మంచిర్యాలలో అకాల వర్షాలకు గోడ కూలి వడ్ల కుప్పల వద్ద ముగ్గురు రైతులు, కొడుకు చనిపోయారు. నల్గొండ జిల్లాలో వడ్ల కుప్పల మీదనే రైతు గుండె ఆగి చనిపోయాడు. ఇంకెంత మంది బలైతే మీకు సోయి వస్తుంది. బీఆర్ఎస్ హయాంలో మేము 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాము. మీరు కొనడం చేతగాక అబద్ధాలు చెబుతున్నారు. నేను మార్కెట్ కు వస్తున్నానని తెలిసి ఈరోజు 4, 5 లారీలు పంపించారు.. మేమొస్తే తప్ప మీరు లారీలు పంపరా.. రైతు భరోసా వారోత్సవాలు అని సిగ్గులేకుండా సంబరాలు చేస్తున్నారు. ఎకరాకు చొప్పున విడతల వారీగా విదిలిస్తూ సంబరాలు ఏ మొహం పెట్టుకుని చేస్తున్నారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, కొనుగోళ్లు అన్నీ ఎగ్గొట్టినందుకు చేస్తున్నారా ఈ వారోత్సవాలు? రాష్ట్ర, దేశ చరిత్రలో యూరియా అమ్మకాలపై నిషేధం విధించిన ఏకైక ఘనత రేవంత్ రెడ్డి సర్కార్ దే. కూరగాయలు, ఆయిల్ పామ్ పండించే రైతులకు యూరియా అమ్మొద్దని బోర్డులు పెట్టడం మీ ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనం. మొక్కజొన్నలు, సన్ ఫ్లవర్ కొని నెలలు దాటుతున్నా రైతులకు ఒక్క రూపాయి వేయలేదు. జొన్నలు, శనగలు కొననే లేదు. కానీ 48 గంటల్లో పైసలు వేస్తున్నామని పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. కేసీఆర్ గారు కరెంటు, సాగునీరు, రైతుబంధు ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశారు. కానీ మీరు ధాన్యం కొనకుండా జాప్యం చేసి, రైతులు దళారులకు అగ్గువకు అమ్ముకునేలా కుట్ర చేస్తున్నారు. వాతావరణ శాఖ అకాల వర్షాలు, తుఫాను హెచ్చరికలు జారీ చేస్తోంది. వర్షం వస్తే చౌటుప్పల్ మార్కెట్ అంతా నీట మునిగి వడ్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని మార్కెట్లకు సరిపడా లారీలు, గన్నీ బ్యాగులు పంపాలి. మిల్లర్లకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసి యుద్ధప్రాతిపదికన వడ్లు కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోయడ శేఖర్ గౌడ్, ఊదరి యాదయ్య, రాజారత్నం, సింగల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మల్కాపురం సర్పంచ్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, ఢిల్లీ మాధవరెడ్డి, సుర్కంటి రాంరెడ్డి, మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, తూర్పునూరి మల్లేష్ గౌడ్, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, ఉడుగు మల్లేష్ గౌడ్, ఎండి అత్తర్ పాషా, పార్టీ కార్యకర్తలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...




# మహిషాసురుడి కథ కరావళి

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'కరావళి'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో గురుదత్త గనిన తెరకెక్కించారు. త్వరలో విడుదలకానుంది. సోమవారం ఫస్ట్‌లుక్ ప్రోమోను విడుదల చేశారు. ఓ వైపు గేదె ప్రసవం, మరోవైపు హీరో జననం..ఈ రెండింటికి ఏదో సంబంధం ఉన్నట్లు చూపించడం..చివరకు హీరో మహిషాసురుడిగా మారినట్లు చూపించడం ఉత్కంఠను పంచింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కరావళి అనే గ్రామంలో జరిగే కథ ఇది. మన భాష, సంస్కృతి మూలాల్లోంచి కథను తీసుకున్నాం. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభిమన్యు సదానందన్, సంగీతం: సచిన్ బస్రూర్.

# గేమ్‌ఛేంజర్ వచ్చేది అప్పుడే?



రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' విషయంలో కొత్త అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా? అని ఆశగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది నిజంగా చల్లని వార్తే. వచ్చే ఏడాది సమ్మర్‌లోపు ఈ చిత్రం షూటింగ్‌ను ముగించనున్నట్టు సమాచారం. దాదాపు 90శాతం ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. ఇదిలావుంటే.. శంకర్ దర్శకత్వంలోనే కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' కూడా పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. దీన్నిబట్టి ఒక రెండునెలలు అటుఇటుగా రెండు సినిమాలూ విడుదలయ్యే అవకాశం ఉందని సినీవర్గాల సమాచారం. ఇక రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' సినిమా విషయానికొస్తే, సమకాలీన రాజకీయాలను ప్రశ్నిస్తూ, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ శంకర్ తెరకెక్కిస్తున్న విప్లవాత్మక చిత్రంగా 'గేమ్‌ఛేంజర్'ని చెప్పొచ్చు. ఇందులో రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కైరా అద్వానీ, అంజలీ కథానాయికలు. ఇంకా శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.



# పద్దెనిమిదేళ్ల విరామం తర్వాత

త్రిష అందంగా ఉంటుంది. తెరపై ఆమె యాటిడ్యూడ్ మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా ఉంటుంది. ఆ నవ్వు విప్పారిన పొద్దుతిరుగుడుపువ్వులా ఉంటుంది. మొన్నామధ్య వచ్చిన మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్'లో చాలామంది హీరోయిన్లున్నా, అందంలో అందరికంటే ఒకమార్కు ఎక్కువ త్రిషకే పడిందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అందుకే.. నేటికీ పెద్దపెద్ద సినిమాలు ఈ అందాన్నే వరిస్తున్నాయి. ఇటీవలే తమిళ విజయ్‌కి జోడీగా ఆమె నటించిన 'లియో' సినిమా విడుదలై మంచి వసూళ్లే రాబట్టింది. త్వరలో మరో భారీ సినిమాలో నటించనుంది త్రిష. అది కూడా తెలుగు సినిమా. అందునా మెగాస్టార్ సినిమా. అవును.. చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'లో త్రిష ప్రధాన కథానాయికగా ఎంపికైంది. అనుష్క, నయనతార, ఐశ్వర్యరాయ్ ఇలా చాలామంది హీరోయిన్ల పేర్లు ఈ పాత్ర విషయంలో వినిపించాయి. చివరకు త్రిష ఖరారైంది. 18ఏళ్ల క్రితం చిరంజీవితో 'స్టాలిన్' సినిమాలో నటించింది త్రిష. మళ్లీ ఇన్నాళ్లకు మెగాస్టార్‌తో జతకట్టనుంది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.



# బాలీవుడ్‌లో సత్తా చూపిస్తా

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ ఏ పాత్రలోనైనా చక్కగా ఒదిగిపోతుంది. వాణిజ్య చిత్రాలతో పాటు మహిళా ప్రధాన కథాంశాల్లో కూడా తనదైన నటనతో మెప్పిస్తుంది. ఈ ఏడాది విడుదలైన 'దసరా' చిత్రంలో వెన్నెలగా అద్భుతాభినయంతో మెప్పించింది. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూ నటిస్తున్న వెబ్ సిరీస్ 'అక్క'. పీరియాడిక్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కనున్న ఈ సిరీస్‌ను బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్‌లో రాధికా ఆప్టేతో కలిసి నటించనుంది కీర్తి సురేష్. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం ఈ సిరీస్ తాలూకు రిహార్సల్స్ ముంబయిలో జరుగుతున్నాయి. సోమవారం ముంబయిలో అడుగుపెట్టిన కీర్తి సురేష్ తన తొలి బాలీవుడ్ వెబ్ సిరీస్ గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. బాలీవుడ్‌లో తన ప్రయాణం ఈ సిరీస్‌తో మొదలుకావడం ఆనందంగా ఉందని, తాను పోషించిన పాత్ర కూడా పూర్తి కొత్తదనంతో ఉంటుందని కీర్తి సురేష్ పేర్కొంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. కీర్తి సురేష్ ప్రస్తుతం తమిళంలో సైరన్, రఘుతాథ, రివాల్వర్ రాణి, కన్నివేడి వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

# వైమానిక వీరుని కథ

వైమానిక వీరుల పరాక్రమాలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొన్న సవాళ్లను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలైంటైన్'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి శక్తిప్రతాప్ సింగ్ దర్శకుడు. మానుషి చిల్లార్ కథానాయిక. సందీప్ ముద్దా నిర్మాత. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న విడుదల చేయబోతున్నారు. త్వరలో టీజర్ రిలీజ్ కానుంది. దర్శకుడు మాట్లాడుతూ ' ఈ సినిమాలో వరుణ్‌తేజ్ ఎయిర్ పైలట్‌గా కనిపిస్తాడు. రాడార్ ఆఫీసర్ పాత్రలో కథానాయిక మానుషి చిల్లార్ నటిస్తున్నది. ఎయిర్‌ఫోర్స్ నేపథ్యంలో వస్తున్న తొలి తెలుగు చిత్రమిది. దేశం ఎదుర్కొన్న అతిపెద్ద వైమానిక దాడుల నేపథ్యంలో యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించాం. దేశభక్తి ప్రధానంగా ఆకట్టుకుంటుంది. 'మేజర్' వంటి విజయం తర్వాత సోనీ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది' అని చిత్రబృందం పేర్కొంది.

